ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
● కలెక్టర్ చామకూరి శ్రీధర్ 6

నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి
● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

తాళ్లపాక అభివృద్ధికి అడుగులు
● అన్నమయ్య జన్మస్థలిపై టీటీడీ దృష్టి 6
● క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారుల పరిశీలన

6 మున్సిపల్ ఉద్యోగులపై విచారణ

హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి : డీఐవో 6

# ఉద్యోగుల సమస్యలపై చర్యలు తీసుకుంటాం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమంలో శుక్రవారం ఆయన ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్‌డేను నిర్వహించి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తించి మరింత సమర్థవంతంగా పనులు చేయాలని ఆయన ఆదేశించారు. వేతనాల చెల్లింపు, బదిలీలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. అన్ని సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత శాఖ అధికారులకు పరిష్కరించమని ఆదేశించారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌డేలో అర్జీలను పరిశీలించారు. వీటిలో వివిధ మండలాల నుంచి ఐదుగురు వీఆర్‌వోలు డిప్యుటేషన్ నిమిత్తం దరఖాస్తు చేయ గా కలెక్టర్ అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డీఆర్‌వోకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ కారణాలతో సస్పెండ్ అయిన నలుగురు ఉద్యోగులను రీ- ఇన్షియేషన్ చేసేందుకు ఫైల్ సర్క్యులేట్ చేయాలని డీఆర్‌వోను ఆదేశించారు. పీటీఎం మండలంలో తహసీల్దార్ వీఆర్‌వోలను విధుల్లో చేర్చుకోవడం లేదని బాధితుడు దరఖాస్తు సమర్పించగా వెంటనే విధుల్లో చేర్చుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని డీఆర్‌వోకు ఆదేశించారు. ఉద్యోగులు సమర్థవంతంగా పని చేస్తేనే పరిపాలన బలోపేతం అవుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత మెరుగైన రీతిలో చేరుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. వీరితో పాటు మరో 20 మంది అర్జీలను సమర్పించినట్లు తెలిపారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

# పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

కడప జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



**వైద్యానికి దారి తీసిన విధానం**

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

**23, 24, 25,** తేదీల్లో కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి బంగళా ఎదురుగా, హరితా హోటల్, ఎపి టూరిజం, కడప నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

**మల్లి చేతిలో దివ్యమైన మూలికలు**

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

# జగన్‌మోహన్‌రాజుకు ఘనస్వాగతం

రాజంపేట / సిద్దవటం / ఒంటిమిట్ట / నందలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి సిద్దవటం చేరుకున్న జగన్‌మోహన్‌రాజుకు స్థానిక నాయకులు పెద్దఎత్తున స్వాగతించి పూలమాలలు వేశారు. ఒంటిమిట్టలో సీనియర్ నేత ఎస్వీ రమణ, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు తదితరులు క్రేన్లతో గజమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ఒంటిమిట్ట కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నందలూరుకు చేరుకున్న ఆయనకు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ యెద్దల విజయసాగర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆ తర్వాత రాజంపేటకు భారీ కాన్వాయ్‌తో చేరుకున్న జగన్‌మోహన్ రాజును టీడీపీ నాయకులు గజమాలలు, శాలువాలు వేసి బాణాసంచా పేల్చుతూ ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, కమ్మ సంఘం అధ్యక్షుడు శివన్నారాయాణచౌదరి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రాజంపేటలో జగన్‌మోహన్‌రాజుకు భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

# పారదర్శకంగా బార్ల కేటాయింపు

● లక్కీడ్రా జరగకపోతే డబ్బులు వాపస్
● ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

మదనపల్లెటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ల కేటాయింపులో పారదర్శకం పాటిస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో మద్యం వ్యాపారులు, రెస్టారెంట్ నిర్వాహకులు, పాత లైసెన్సీ దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ ఒక్కో బార్‌కు నాలుగేసి దరఖాస్తులు రాకుంటే, మూడు దరఖాస్తుదారులు చెల్లించిన నాన్ రీఫండబుల్ డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజు వెనక్కి ఇవ్వరంటూ ప్రచారం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఈఎస్ మాట్లాడుతూ బార్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లక్కీ డ్రా నిర్వహిస్తామని, ఒక వేళ మూడు, అంతకంటే తక్కువ దరఖాస్తులు వచ్చి లక్కీడ్రా జరగకపోతే దరఖాస్తుకు చెల్లించిన డబ్బులు వాపస్ ఇస్తామన్నారు. రెస్టారెంట్ లైసెన్సు లేకపోయినా బార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని, లైసెన్సు వచ్చాక రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 26 సాయంత్రం 5గంటల వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 28న రాయచోటిలో కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భీమలింగ, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

# మదనపల్లెలో ఏసీబీ సోదాలు



మదనపల్లెలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో రెండు చోట్ల అనంతపురం, తిరుపతికి చెందిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. తిరుపతిలో లేబర్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న బాలు నాయక్‌కు ఆదాయం కంటే ఆస్తులు ఎక్కువగా ఉన్నాయనే నేపథ్యంలో ఏసీబీ అధికారులు బాలునాయక్ ఇంటితో పాటు వారి సమీప బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె, ఎగువ కురవంక, రవీంద్రనగర్‌లో అతని కుమారుడు శ్రీకాంత్ నాయక్ ఇంట్లో జేసీ ప్రశాంతి ఆదేశాల మేరకు తిరుపతి ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్, తన వియ్యంకుడు వాలేనాయక్ రామారావు కాలనీలోని ఇంట్లో అనంతపురానికి చెందిన ఏసీబీ సీఐ నరసింహారావు సిబ్బందితో వెళ్లి సోదాలను నిర్వహించారు. ఇంట్లోని రికార్డులను, పేపర్లను పరిశీలించారు. ఇంటిని తనిఖీ చేశారు.

# తాళ్లపాక అభివృద్ధికి అడుగులు

● అన్నమయ్య జన్మస్థలిపై టీటీడీ దృష్టి ● తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయం ● క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారుల పరిశీలన





తాళ్లపాక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యానమందిరం

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు, శ్రీవారిపై 32 వేల సంకీర్తనలు రచించిన తాళ్లపాక అన్నమాచార్యుల గ్రామ అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. వైసీపీ హయాంలో కొత్తగా ఏర్పడిన జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టినా.. ఆయన జన్మస్థలి అయిన తాళ్లపాక అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాళ్లపాక అభివృద్ధిపై టీటీడీ దృష్టి సారించింది. అన్నమయ్య జన్మస్థలిని అభివృద్ధి చేయకుండా జిల్లాకు ఆయన పేరు పెట్టినంత మాత్రాన ఉపయోగం ఏమిటని ఇటీవల కూటమి నేతలు టీటీడీ పాలకమండలి దృష్టికి తీసుకుపోయారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, స్థానిక తాళ్లపాక గ్రామవాసి, పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఉద్దండం సుబ్రమణ్యం తదితరుల ఆధ్వర్యంలో తాళ్లపాక సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులపై పాలకమండలికి వినతిపత్రం ఇచ్చారు.

## 16 సమస్యలపై అధ్యయనం

ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తాళ్లపాకలో సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేసి అన్నమయ్య ఖ్యాతిని ఇనుమడింపజేయాలని నిర్ణయించారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసి అందుకు సంబంధించిన నివేదికలను టీటీడీకి సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఇటీవలే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాక గ్రామాన్ని సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. ప్రధానంగా 16 సమస్యల పరిష్కారానికి నివేదికలు తయారు చేయడానికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు.

## నివేదికల తయారీ

కడప చెన్నై జాతీయ రహదారిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద నుంచి తాళ్లపాక గ్రామం వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి. ఈ రోడ్డులో అన్నమయ్య, శ్రీవారి ప్రతిమలను ఏర్పాటు చేయాలి. ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు సెంట్రల్ లైటింగ్, తాళ్లపాక చెరువు మధ్యలో అన్నమయ్య పదవికతలను రాస్తున్నట్లు భారీ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉంది.

గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యాన మందిరాన్ని కొత్తగా ఏర్పాటు చేయాలని, అన్నమయ్య పూర్వీకులు ఉన్న ఇంటి ప్రాంతంలో ఒక కుటీరం, గ్రామంలో సంగీత కళాశాల, శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. నిత్యం అన్నమయ్య సంకీర్తనలను వినిపించాలని, అన్నమయ్య ఇలవేల్పులైన చెన్నకేశవ, సిద్ధేశ్వర ఆలయాలను అభివృద్ధిపరచాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాళ్లపాకను ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటిపై టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా తిరుమల తిరుపతి వేదస్థానం నిధులు మంజూరు చేసి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేస్తే జిల్లాకు అన్నమయ్య అని పేరు పెట్టినందుకు సార్థకత ఏర్పడుతుంది.

### విజ్ఞప్తులను టీటీడీ ఆమోదించింది



ఇటీవల టీటీడీ చైర్మన్, ఈవోలను కలిసి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధిపై 16 సమస్యలతో కూడిన నివేదికను సమర్పించాం. వీటి ఆధారంగా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి టీటీడీ ఆమోదించింది. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాకను సందర్శించారు. వీరు నివేదికలు ఇచ్చిన వెంటనే తాళ్లపాక అభివృద్ధి శరవేగంగా జరగనుంది.

**- పోతుగుంట రమేశ్‌నాయుడు,**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట**

### తాళ్లపాకను అభివృద్ధి చేయకపోతే ఎలా



గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లాకే ఆయన పేరు పెట్టి ఆయన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయకపోతే ఎలా అని మేము ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని, అధికారులను కలిసి విన్నవించారు. దీంతో వారు తాళ్లపాక గ్రామ అభివృద్ధికోసం ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామం.

**- ఉద్దండం సుబ్రహ్మణ్యం,**
**పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, తాళ్లపాక**

---

## టమోటా మార్కెట్‌లో సమస్యలేంటి ?

● సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా



మదనపల్లె మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌లో రైతులు, ట్రేడర్స్ ట్రాఫిక్ సమస్యలు ఏవేమి వున్నాయంటూ సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా తీశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె యార్డు అంతటా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక క్రేట్‌కు ఎన్ని కిలోల టమోటాలు పడతాయి, వేలం పాటలు ఏవిధంగా జరుగుతున్నాయంటూ ప్రశ్నించారు. సీజన్‌లో 2 వేల టన్నుల దాకా టమోటా విక్రయానికి వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. ఇటీవల 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించినప్పుడు చేసిన సూచనల గురించి ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం యార్డు శివారులోని సివిల్ సప్లైస్ గోదామును సబ్‌కలెక్టర్ పరిశీలించి స్టాకు వివరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు కార్యదర్శి జగదీష్, అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్



ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విశ్వనాథ్

బి.కొత్తకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్యాక్రాంతమైన దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి చేస్తూ, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మండల స్పెషలాఫీసర్‌గా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. పీహెచ్‌సీగా వుంటూ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా రూపాంతరం చెందిన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు ఆరీఫుల్లా, ఫార్మసిస్ట్ సునీల్‌కుమార్‌లతో మాట్లాడి, ఆసుపత్రిలో వైద్యసదుపాయాలు, సిబ్బంది కొరత, అధునాతన పరికరాల లభ్యత, వివిధ రకాల మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషలాఫీసర్ హోదాలో ఆసుపత్రి తనిఖీ చేశాన న్నారు. జిల్లాలో శ్రీవాణి పథకం ద్వారా 230 ఆలయాలకు రూ.10లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు మంజూర య్యాయన్నారు. అదే విధంగా కొన్ని ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## మెరుగైన సేవలు అందించాలి : ఎండీ

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, విద్యుత్ ప్రసారంలో అంతరాయాలు నివారించడంతో పాటు లోటల్టేజీ సమస్యలు తీర్చాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోశ్‌రావు సూచించారు. పట్టణంలోని రాజధాని కల్యాణ మండపంలో శుక్రవారం ప్రజా సానుకూల అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె డివిజన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు దేవుళ్లతో సమానమని, వినియోగ దారులతో సత్సంబంధాలను కొనసాగించాలని తెలియజేశారు. ఈ సదస్సులో చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై సమీక్ష నిర్వహించి మండల అధికారులకు ఆ సెక్షన్‌లో పనిచేసే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర, డిప్యూటీ ఇంజనీర్స్ అసిస్టెంట్ ఇంజనీర్స్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సంతోశ్‌రావు

## ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్ర వారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ యూరియా కొరత రానివ్వకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా తగినన్ని నిలువలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానీయకుండా సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారు లను ఆదేశించారు. అన్ని మండలాల్లో బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టాలని కలెక్టర్ సూచించారు.

## నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి: ఎస్పీ



కోర్టు కానిస్టేబుల్స్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు న్యాయం జరిగేలా సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన బీఎన్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధిత స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఈ సాక్ష్య, ఈ సమన్లు అమలు చేయడం కోసం, నేర స్థలంలో ఫొటోలు, వీడియో రికార్డింగ్ చేయడం కోసం, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన అత్యాధునిక ట్యాబులను ఎస్పీ ఆయా స్టేషన్ల సిబ్బందికి అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎ.ఆదినారాయణరెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరామ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజారమేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ టి.మధు, ఎస్ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## 12 అంశాలతో కళా ఉత్సవ్ పోటీలు

● జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి



రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్న జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా 12 అంశాలతో కళాఉత్సవ్-2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో కళాఉత్సవ్-2025కు సంబంధించి రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రాయచోటి డైట్ కేంద్రంలో వ్యక్తిగతంగా కానీ, 9440246825 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కానీ, గూగుల్ ఫామ్ ద్వారా కానీ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు.. చంద్రామాకులపల్లెకు చెందిన రామచంద్ర (48) డయాలసిస్ చేయించుకునేందుకు శుక్రవారం ఇంటి నుంచి బైకులో వెనెకవైపు కూర్చొని మదనపనల్లె ఆస్పత్రికి బయలుదేరారు. బసినికొండ వద్ద మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడని, వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కాగా మృతుడికి పిల్లలు లేరని, భార్య ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## మున్సిపల్ ఉద్యోగులపై విచారణ

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అనుబంధ పత్రాలను అందజేయడంతో పాటు వాటి గురించి 15 రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ శుక్రవారం ఆరుగురికీ నోటీసులు జారీ చేసింది. 2022 ఆగస్టు 4న రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగురు ఉద్యోగులకు సంబంధించి పలు ఉల్లంఘనలను ఏసీబీ గుర్తించింది. మున్సిపాలిటీ ఇన్‌చార్జీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ చంద్రగిరి లక్ష్మీనారాయణమ్మ, మున్సిపాలిటీ కార్యాలయం మేనేజరు పెర్లి శేషఫణి, సీనియర్ అసిస్టెంట్ బాలంహరినాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూల వెంకటమధుసూదన్, ఎన్నసూరు వెంకటరామకృష్ణ, లైటర్ ఇన్‌చార్జి షరాఫ్ షేక్ జమీల్ అహ్మద్‌లపై వేర్వేరు అభియోగాలు ఉన్నాయి. ఈ ఆరుగురి నుంచి సంజాయిషీలు అందిన తరువాత ప్రభుత్వం తదుపరి చర్యలకు ఉపక్రమించనుంది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఆరుగురికీ విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

## రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నాగోతు రమేశ్‌నాయుడు



నాగోతు రమేశ్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా రాజంపేటకు చెందిన నాగోతు రమేశ్‌నాయుడును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవన్ నియమించారు. రమేశ్‌నాయుడు ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొత్తగా రాష్ట్రంలో నలుగురు ప్రధాన కార్యదర్శులను నియమించిన సమయంలో అన్నమయ్య జిల్లా నుంచి ఈయనకు స్థానం కల్పించారు. ఆయన విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ నాయకుడిగా, డిగ్రీ కళాశాల చైర్మన్‌గా, కూచివారిపల్లె సర్పంచ్‌గా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

## అవగాహనతోనే ఎయిడ్స్‌కు దూరం

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి




విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఐఈవో రవి, తదితరులు

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రవి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి పర్యవేక్షణలో జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు మొదటి బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు, తృతీయ బహుమతి కింద రూ.2 వేల చొప్పున అందజేశారు. అనంతరం డీఐఈవో మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు కళాశాలతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు.

## హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి

● వైద్యుల శిక్షణలో డీఐవో డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులకు ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించి వారికి సుఖప్రసవం నిర్వహించడంపై మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో శిక్షణ పొందిన వారితో జిల్లాలో పనిచేస్తున్న వైద్యులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా మాతాశిశు మరణాలను తగ్గించడంలో భాగంగా వైద్యులకు ఇటువంటి శిక్షణలు ఇచ్చి వారి ద్వారా ప్రమాద సంకేతాలు గల గర్భవతుల ఆరోగ్య పరిస్థితిపై నెలావారీగా ట్రాక్ చేసి సుఖప్రసవం అయ్యే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ కిజియా, డాక్టర్ లీల తదితర వైద్యులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురు మహిళల అరెస్టు

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీ తుమ్మలపేట వడ్డెపల్లె గ్రామంలో ఒక వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి కలికిరి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో శుక్రవారం ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వివరాల ప్రకారం.. గత బుధవారం గ్రామానికి చెందిన ఆవుల రామయ్య, సనపతి రమేష్, ఆవుల రత్నమ్మ, సనపతి అంజనమ్మ, ఆవుల సరోజమ్మలు కోళ్ల దొంగతనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ అనే వ్యక్తి కనుక్కొని వారిని పట్టుకునేందుకు యత్నించాడు. దీంతో తమ వద్ద వున్న కొడవలితో అతనిపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో చంద్రశేఖర్ గట్టిగా కేకలు వేయడంతో ద్విచక్రవాహనంలో నిందితులు పారిపోయారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎస్టీ కాలనీ సమీపంలో వున్న రత్నమ్మ, అంజనమ్మ, సరోజమ్మలను సిబ్బందితో కలిసి వెళ్లి సీఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారు. నిందితుల వద్ద కోళ్లు, కొడవలి స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ మదనమోహన్ రెడ్డి, పీసీలు మహ్మద్ అలీ, సరస్వతి, రెడ్డికుమారి, దినేష్‌కుమార్‌లు నిందితులను పట్టుకోవడంలో కృషి చేశారని, వీఆర్వో ప్రసాద్ రెడ్డి, వీఆర్ఏ మల్లికార్జునల సమక్షంలో పంచనామా నిర్వ హించినట్లు సీఐ వివరించారు.

## మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టి.సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామంలో ఉద్యాన సహాయకుడిగా పనిచేస్తున్న వల్లూరి ఇమ్రాన్ పని ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుటుంబ సభ్యులతో పాటు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. వృత్తి పట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఎలాంటి వ్యసనాలు లేని వ్యక్తి మృతి బాధాకరమని తెలియజేశారు. ఆర్థికపరంగా కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని విన్నవించారు. ఒత్తిడికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తారు రోడ్డు నిర్మాణానికి రోలరుతో చదను చేస్తున్న దృశ్యం

# జాతీయ రహదారి నిర్మాణానికి అటవీ అడ్డంకులు

● కొనసాగుతున్న పనులు
● పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగేదెన్నడో...!

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణ పనులు ఒక వైపు శరవే గంగా జరుగుతున్నా... అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర ఆలస్యం అవుతున్నాయి. టేకూరుపేట సరిహద్దులో దాదాపు ఏడున్నర కిలోమీటర్ల మేర అనుమతులు లభించాల్సి ఉంది. ఇప్పటికే చాలాసార్లు సంబంధిత అధికారులు అటవీ ప్రాంతలో సర్వే నిర్వహించి నివేదికలు కూడా పంపారు. కానీ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా అటవీశాఖ నుంచి ఇంకా పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో ఆ ప్రాంతలో రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అటవీశాఖ నుంచి క్లియరెన్స్ పూర్తయితే అంచనాల మేరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయి.

సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముదిరెడ్డిపల్లె - కడప ప్యాకేజీకి సంబంధించి 167బీ జాతీయ రహదారి నిర్మాణానికి 36 కిమీ పొడవునా పది మీటర్ల వెడల్పుతో రూ.186 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది అక్టోబరు 14న పనులు ప్రారంభించగా సజావుగా సాగుతున్నాయి. అయితే నెల్లూరు-కడప సరిహద్దు వద్ద 7.5 కిమీ, కొండుగారిపల్లె వద్ద 400 మీటర్ల మేర అటవీ శాఖ ఫారెస్టు శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంది. ల్యాండ్ ఎక్విజిషన్‌కు సంబంధించి మల్లేపల్లె వద్ద 500 మీటర్లు, కేశవాపురం వద్ద 400 మీటర్లు, రంగసముద్రం వద్ద 300 మీటర్లు క్లియరెన్సు కావాల్సి ఉంది. ఒక పక్క పనులేమో శరవేగంగా జరుగుతున్నా అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర జాప్యం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సింగరాయకొండ టు మైదుకూరు మీదుగా కడపకు ప్రయాణ సమయం తగ్గే అవకాశాలున్నాయి.

ఇప్పటివకు ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి 76 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 48 కల్వర్టులు పూర్తయ్యాయి. మరో 24 కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి. 21 కిలోమీటరు వరకు దాదాపు రోడ్డు పూర్తయింది. మరో 15 కి.మీ. పూర్తి కావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతుల కోసం సంబంధిత కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు మేనేజరు మణికంఠను వివరణ కోరగా. పనులు వేగంగా జరుగుతున్నాయని, 2026లోపే పనులు పూర్త య్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దుల్లో అటవీశాఖ నుంచి అనుమతులు వస్తే త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

## ప్రతి రైతుకు యూరియా అందిస్తాం

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలం టి.సోదరివారిపల్లె సచివాలయ పరిధిలోని రైతు సేవాకేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అక్కడ రైతులకు యూరియా పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా పంపిణీ ఎలా జరుగుతోందని అక్కడున్న వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజనులో విడతల వారీగా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే యూరియా సరఫరా చేస్తారన్నారు. ఎకరాకు బస్తా చొప్పున పంపిణీ అందజేయలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, ప్రభుత్వం సరఫరా చేసే యూరియాను 50శాతం రైతు సేవాకేంద్రాల ద్వారా, 50శాతం డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, తహశీల్దారు కార్తీక్, డిప్యూటీ తహశీల్దారు జాన్సన్, సాంబశివారెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## యువతిని మోసం చేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

● రూ.1.5 లక్షల జరిమానా


శిక్ష పడిన నిందితుడిని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిమఠం పోలీసుస్టేషన్ పరిదిలో రెండున్నర సంవత్సరాల క్రితం ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. అత్యాచారం చేసి మోసం చేసిన కేసులో సానా రవికుమార్ (24) అనే వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్‌కుమార్ తీర్పునిచ్చారు. కేసు వివరాలా.. బి.మఠం మండలంలోని ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. నెల రోజుల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి పెళ్లి చేసుకోమని అడగ్గా నిరాకరించాడు. దీంతో నిందితుడు రవికుమార్ తనను మోసం చేసినట్లు బాధితురాలు 2023 జనవరి 31న బి.మఠం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి కేసు విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి పై విధంగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## ఏఎఫ్‌ఏయూకి గురుకుల భవనాలు కేటాయింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇకపై ప్రైవేట్ అద్దె భవనాల్లో కాకుండా, తాత్కాలికంగా ప్రభుత్వ భవనాల్లో పనిచేయనుంది. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యాశాఖ ఆదేశాలమేరకు, యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను తాత్కాలికంగా ఆర్కి టెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు. మొత్తం 8 బ్లాకులు, సుమారు 9360 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ ప్రభుత్వ భవనాలను దశలవారీగా అందజేయనున్నారు. మొదట 4 బ్లాకులు వెంటనే కేటాయించాలని ఆదేశించారు. మిగిలిన 4 బ్లాకులను వచ్చే నెలలోపు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఈ భవనాల్లో యోగి వేమన యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగాలు నడుస్తున్నాయి. వీటిని తాత్కాలిక సర్దుబాట్లతో వేరే చోటకు మార్చనున్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఇకపై అద్దె భవనాల బదులుగా ప్రభుత్వ భవనాల్లో సౌకర్యవంతంగా చదువుకునే అవకాశం పొందుతారు.

**మంత్రి నిర్ణయం హర్షణీయం...**

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనాల్లో పడుతున్న ఇబ్బందులను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## యూరియా అక్రమంగా విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను అక్రమంగా విక్రయించినా, ఇతర అవసరాలకు మళ్లించినా చర్యలు తప్పవని ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత హెచ్చరించారు. ఏవో వరహరికుమార్‌తో కలిసి శుక్రవారం ప్రొద్దుటూరులో మహాలక్ష్మి ఫర్టిలైజర్స్, కేవీఎస్ఆర్ హోల్‌సేల్ ఎరువుల దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నుంచి దువ్వూరు, చాపాడు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల తదితర రీటైల్ దుకాణాలకు సరఫరా అయిన యూరియా ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులకు ఇక్కడి వివరాలను పంపి ఆమేరకు రిటైల్ దుకాణాలకు యూరియా చేరిందా? చేరిన సరుకు రైతులకు సక్రమంగా విక్రయించారా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాను జిల్లాలోపు విక్రయాలు జరపాలని, సరిహద్దులు దాటి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వక్ఫ్‌భూమి పునరుద్ధరణ

● అబుహురైరా మసీద్ స్థలం 44సెంట్లు కమిటీకి అప్పగింత


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 24వ డివిజన్‌లో 300 ఏళ్లనాటి అబూహురైరా మసీద్ వక్ఫ్‌భూమి (సర్వేనెంబర్ 267) మొత్తం 1.68 ఎకరాలు ఉండగా, కాలక్రమంలో పెద్ద భవనాల ఆక్రమణకు గురై కేవలం 44సెంట్లు మాత్రమే మిగిలింది. ఆ స్థలం కూడా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ విషయాన్ని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దృష్టికి కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. వారు స్పందిస్తూ సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మసీదుకు సంబంధించిన 44సెంట్లు మసీదుకు సంబంధించినదేనని నిర్ధారించి అధికారుల సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి, మాధవి మాట్లాడుతూ మసీదు భూమిని పరిశుభ్రంగా ఉంచి, పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని మసీదు కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.మన్సూర్ అలీఖాన్, 24వ డివిజన్ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి, షారూక్, అబూహురైరా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైవీయూలో 'హెల్ప్‌లైన్' ఏర్పాటు


హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూతో పాటు జిల్లాలోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) సైట్‌లోకి వెళ్లి ప్రతి విద్యార్థి డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని.. వారి సౌకర్యార్థం ఉచితంగా సహాయ కేంద్రం పనిచేస్తుందన్నారు. వైవీయూ క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు, నాలుగేళ్ల హానర్స్ కోర్సులు బీకాం కంప్యూ టర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, అలాగే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో ప్రవేశానికి ఇక్కడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సందేహాలకు 9441032737 నెంబర్‌ను సంప్ర దించాలని కోరారు.

## కేసు పెట్టిస్తావా అంటూ... తల్లి, చెల్లిపై కొడుకు దాడి

ప్రొద్దుటూరు , ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బంగారు అంగళ్ల వీధిలో నివాసంవుండే వేంపల్లె మూగన్నగారి వనిత, కుతూరు డాక్టర్ లక్ష్మీసామినిరెడ్డిపై ఆమె కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి దాడి చేసి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తనకు ఇష్టం లేకున్నా చెల్లెలు లక్ష్మీసామినికి వేరే వ్యక్తితో పెళ్లి జరిపించిందని కోపంతో ఈ దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. మోడంపల్లె బైపాస్ రోడ్డులో వనిత కొత్త ఇల్లు కడుతున్నారు. ఆ ఇంటి వద్దకు ఆమె కారు తీసుకొని వెళ్లగా అక్కడికి ఆమె కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, భార్గవ, సందీప్‌లతో పాటు మరి కొంతమంది కలిసి కారుపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. వనితను చంపుతామని బెదిరించారు. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో వనిత, చెల్లి లక్ష్మీసామిని కలిసి కేసు పెట్టారు. ఈ కేసు పెట్టారని కోపంతో తిరిగి శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న తల్లి వనిత, చెల్లెలు లక్ష్మీసామినితో పాటు మరో వ్యక్తిపై హర్ష అతని స్నేహితులు కలిసి కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు హర్షవర్ధన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సందీప్‌రెడ్డి అనే ముగ్గురుని అరెస్టు చేసి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి


వెంకట శివుడు (ఫైల్)

మైలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాధవాపురం గ్రామానికి చెందిన బనగానివెంకటశివుడు (56) అనే వ్యక్తి గురువారం ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మిద్దెపై పని ఉండడంతో పైకి ఎక్కగా చుట్టూ కాంపౌండ్ గోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యా యి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## దొంగ అరెస్ట్.. 52 గ్రాముల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ బంగారు నగలు, నిందితుని చూపుతున్న సీఐ, ఎస్ఐ

పుల్లంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప చెన్నై జాతీయ రహదారి సమీపంలో దొంగను అరెస్టు చేసి, 52 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. పుల్లారెడ్డిపల్లెకు చెందిన పుట్టబోయిన చరణ్‌కుమార్ అనే దొంగ వద్ద నుంచి బంగారు నెక్లెస్, డాలర్‌తో ఉన్న చైను, బుట్ట కమ్మలు, చిన్న కమ్మలు, చెవి చుట్టలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. పుల్లంపేట ఎస్ఐ శివకుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక విజ్ఞాన కళాశాలలో దరఖాస్తులు ఆహ్వానం

సీకేదిన్నె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గుంటూరు లాంఫాంలోని సామాజిక విజ్ఞాన కళాశాలలో నిర్వహిస్తున్న బీఎస్సీ నాలుగేళ్ల కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సామాజిక శాస్త్రవేత్త ప్రశాంతి తెలిపారు. రాష్ట్రంలో ఏకైక కళాశాలగా గుర్తింపు పొందిన ఈ కళాశాలలో విద్యార్థులకు బోధనతోపాటు శిక్షణ ఇచ్చి వారి ఉన్నతికి బాటలు వేస్తారన్నారు. 2025-26 సంవత్సరానికి కోర్సు మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు చివరి గడువు ఆగస్టు 31 అని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌జీఆర్ఏయు.ఎసి.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫీజు డీడీ జత చేసి గుంటూరు లాంఫాంలోని వర్శిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందించాలన్నారు. ఈ కోర్సులో ఆహారం-పోషణ, మానవ అభివృద్ధి - కుటుంబ అధ్యయనం, వనరుల యాజమాన్యం తదితర అంశాల్లో బోధన, తరగతిగదులు నిర్వహించి శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులుగా తయారు చేస్తారన్నారు. మొత్తం వంద సీట్లు ఉన్నాయని... ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదివినవారు, మూడేళ్ల హోంసైన్స్ చదివినవారు, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ, డిప్లమాలో ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఎంసెట్, నీట్‌తో ఎటువంటి సంబంధం లేదని, నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సు చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

## అభివృద్ధి పనుల నివేదికను సీఎంకు అందజేస్తాం

● టీటీడీ నిపుణుల కమిటీ సభ్యుడు రాము


కోదండరామాలయంలో పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

ఒంటిమిట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో చేపట్టాల్సిన పనుల నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేస్తామని టీటీడీ నిపుణుల కమిటీ సభ్యుడు రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒంటి మిట్టకు విచ్చేశారు. కోదండరామాలయం కల్యాణవేదిక తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఒంటిమిట్టలో చేప ట్టాల్సిన పనులు, భవనాలు భక్తుల వసతులు, ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనులను పరిశీలించామని.. ఈ విష యాలను టీటీడీ బోర్డుకు తెలియజేస్తామన్నారు. తదనం తరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పూర్తి నివేదిక అందజేస్తామన్నారు. అంతకుముందుగా కోదండరా మాలయం, కల్యాణవేదిక పరిసర ప్రంతాల్లో కలియదిరిగి ఎక్కడ ఎలాంటి వసతులు కల్పించాలి, చెరువు సుందరీకరణ, అన్నదాన భవనం అంశాలపై ఆలయ అధికారులు అర్చకులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామని.. అందులో భాగంగానే ఒంటిమిట్టను సందర్శించామన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ గుర్తింపుపై శిక్షణ

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకరమైన క్యాన్సర్‌ను ముందస్తుగా లక్షణాలను బట్టి గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్యాధికారులకు శిక్షణ నిర్వహించారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌సీడీ 4.0 - 2 శిక్షణ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి ప్రజల ప్రాణాలను కాపాడటమే శిక్షణ ఉద్దేశ్యమన్నారు. రెఫరల్ సిస్టం ద్వారా అనుమానిత కేసులను తక్షణం పై ఆస్పత్రులకు పంపించడం, ఎన్‌సీడీ పోర్టల్‌లో వివరాల నమోదు చేసి ఫాలోఫ్ చేసే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్ఎంవో గోపాల్‌దాస్, డాక్టర్లు చిరంజీవిరెడ్డి, మల్లేష్, ఆరీఫ్, మంజుల, అనూష, కవిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మృతిపై అనుమానాలున్నాయి...

దర్యాప్తు చేసి.. నిజాలు వెల్లడించాలి ● విద్యార్థి బంధువులు


విద్యార్థి నరసింహనాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న బాబాయ్ ఉమామహేశ్వరరావు, బంధువులు

వేంపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.నరసింహనాయుడు (18) అనే విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే విద్యార్థి మృతిపై మృతుడి బాబాయ్ ఉమామహేశ్వర్‌రావు, బంధువులు అనుమానాలు ఉన్నాయని... సక్రమంగా దర్యాప్తు చేసి నిజాలు వెల్లడించాలని పోలీసులకు, ట్రిపుల్‌ఐటీ అధికారులను కోరారు. శుక్రవారం శ్రీకాకుళం నుంచి ఉమామహేశ్వర్‌రావు, ఇతర బంధువులు వేంపల్లెకు చేరుకున్నారు. మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఏఓలను కలిశారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకునేంత సమస్యలు లేవు, విచారణ చేయించి నిజాలు బయటపెట్టాలని కోరారు. అలాగే పోలీసులను కలిసి దర్యాప్తు త్వరగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా డీఎస్పీ మురళీనాయక్ మృతదేహాన్ని పరిశీలించి బంధువులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులను విచారించారు. వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా వారు శ్రీకాకుళంకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

## మంత్రి మండిపల్లిని కలిసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



మంత్రితో టీడీపీ నేతలు, అధికారులు

రాయచోటిటౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో భాగంగా పట్టణంలోని ఆర్అండ్‌బీ స్టేట్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం పలువురు కూటమి నేతలు, అధికారులు, ప్రజలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సమస్యలను వినిపించారు. అనంతరం మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లాబాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దారు అమరేశ్వరి

నందలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దారు అమరేశ్వరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యత వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంఈవో నాగయ్య, ఎంఈవో అనంతకృష్ణ, కళాశాల అధ్యాపకులు లక్ష్మీనారాయణ, పీడీ గౌరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లలితా సహస్రనామ కుంకుమార్చన

నందలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లె కోదండరామాలయంలో శుక్రవారం లలితాసహస్ర నామ కుంకుమార్చన, షట్కోణ దీపార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున కుంకుమార్చన చేశారు. ఆలయ ధర్మకర్త గంపా సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

## వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గల్లా రమణ, ఆలయ కమిటీ చైర్మన్ గవనూతల ప్రభాకర్, కోశాధికారి కారుమంచి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**పెనగలూరులో నేటి నుంచి..**

పెనగలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపాన గల వెంకయ్యస్వామి సిద్ధ ఆశ్రమంలో మూడు రోజుల పాటు వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పెడమళ్ల బుజ్జిరెడ్డిస్వామి తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం, వెంకయ్యస్వామి, అన్నమాచార్య గీతాలాపనలు, రామాయణం, భాగవతం, మహాభారతంపై ఉపన్యాసాలు, భజనలు నిర్వహిస్తామని తెలిపారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

రామాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అనిఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాజకీయ పార్టీల పాటలకు అనుమతి లేదని భక్తి పాటలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

# సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

● మండల సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడి ఆగ్రహం

సిద్దవటం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కరించడం లేదని, ప్రజల సమస్యలు తీర్చలేని సమావేశాలు ఎందుకంటూ బొగిడివారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో శుక్రవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేకనాపురం గ్రామంలోని డంపింగ్‌యార్డు స్థలానికి మాధవరం-1 గ్రామానికి చెందిన ఓ రైతు కంచె వేసినా, మండల అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డు కట్టేటప్పుడు ఎక్కడ మార్కింగ్ ఇస్తున్నా మో అధికారులకు తెలియదా అని ఆగ్రహించారు. మొత్తంమీద ఆ స్థలం ప్రభుత్వానిదా, రైతులదా అన్న విషయం తేల్చాలన్నారు. ప్రజలకు ఉపయోగ పడే డంపింగ్‌యార్డు చుట్టూ కంచె వేయడంపై అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని, ప్రజా సమస్యలు పరిష్కారం కానప్పుడు సర్వసభ్య సమావేశాలు ఎందుకంటూ ప్రశ్నించారు. మాధవరం ఎంపీటీసీ సభ్యుడు శివయ్య మాట్లాడుతూ మాధవరం గ్రామంలోని పార్వతీపురం గంగమ్మ గుడి వద్ద ఉన్న బోరు నీరు ఏ ప్రాంతానికి వెళతాయో తెలియదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిరాజకుమారి, మండల ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మేరువ మల్లీశ్వరి, మండల కోఆప్షన్ మెంబర్ సయ్యద్ పాల్గొన్నారు.

## 'ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా..'



ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది దాడులు నిర్వహించి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల కారణంగా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వాటిని తిని పశువులు మరణిస్తున్నాయని తెలిపారు. దుకాణదారులు, ప్రజలు ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలని ఆయన కోరారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణాలపై దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న మావులూరి విశ్వనాథ్

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాతసైకం వారిపల్లెలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం స్థానికులతో కలిసి అన్నమయ్య జిల్లా డీఆర్వో మధుసూదన్‌ను వినతి పత్రం సమర్పించారు. కేవలం స్కీం బోరులో రీ బోర్ వేస్తే సమస్య పరిష్కారమవుతుందని ఏడాది నుంచి చెబుతున్నా పంచాయతీ కార్యదర్శి, మాధవరం గ్రామ సర్పంచ్ పట్టించుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానికులు నాగరాజ, మణికంఠ, నడిపిరెడ్డెయ్య ు పాల్గొన్నారు.

## 'మూల్యాంకన పుస్తకాల విధానం మార్చాలి'

రాయచోటిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకన పుస్తకాల విధానంలో మార్పు తేవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు శుక్రవారం ఏపీటీఎఫ్ నేతలతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకన పుస్తకాలతో పరీక్షల నిర్వహణ అనే కొత్త విధానం కొత్త కొత్త సమస్యలకు దారి తీస్తోందన్నారు. దీంతోమంచి ఫలితాలు రాకపోవడమే కాకుండా నష్టదాయకంగా మారకముందే ఈ ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బీలునాయక్, గిరిబాబు, మహమ్మద్‌అలీ, వేణుగోపాల్, శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలివ్వాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదంటూ రాజంపేట మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్, మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి పీవీ రమణ, లక్ష్మీదేవి తదితరులు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు కమిషనర్‌ను అడిగితే కాలయాపన చేస్తున్నారని దీనివల్ల తమకు పూట గడవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు.

## కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు అభినందన

రాయచోటిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో విజయం సాధించిన 5 గురు హోంగార్డులను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సన్మానించి అభినందించారు. అనంతరం కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన సంజీవ్, గంగాదర్, విజయకుమార్‌నాయక్, టీయం ఖాజాపీర్, నరసింహులు మాట్లాడుతూ తమకు కానిస్టేబుల్ ఉద్యోగులు రావడంతో అభినందించిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ ఎం. పెద్దయ్య పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి**

హెల్మెట్ పెట్టుకోకపోవడంతోనే తన తండ్రిమరణించాడని, ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డ్ ఈశ్వర్ నాయక్ కుమారుడు హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశాడు. . శుక్రవారం ఎస్పీని కలిసి తన తండ్రి మృతి వివరాలు తెలియజేశాడు. ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

## విద్యార్థులకు నగదు బహుమతులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ గల పదిమంది పదో తరగతి విద్యార్థులకు బయోస్టడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీనియర్ సేల్స్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.2500లు చొప్పున రూ.25 వేలు నగదుతో పాటు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ మొత్తం అందజేస్తున్నామని వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వరదరాజు ఫీల్డ్ అడ్వైజర్ చాన్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకం ఉత్తమం

వీరబల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పెరటి తోటల పెంపకం ఉత్తమమని డీఆర్‌డీఏ వెలుగు ఏపీయం ఖాదర్‌వలి అన్నారు. శుక్రవారం ఈడిగపల్లెలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి నాటించారు. ప్రతి కుటుంబం ఇంటి ఆవరణంలో పెరటితోటలు పెంచాలన్నారు. పచ్చిమిరప, గోంగూర, మునగ, బెండ, వంగ, టమోటా, కాకర, బీర వంటి 15 రకాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ గంగాధరం ప్రకృతి వ్యవసాయ యూనిట్ కోఆర్డినేటర్ అంజనేయులు, ఐసీఆర్‌పీలు స్వప్న, అనురాధ, ఐఎఫ్‌సీ, సీఆర్‌పీ జ్యోతి, మండల యాంకర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ పంపిణీ పరిశీలన



ఆల్బెండజోల్ పంపిణీని పరిశీలిస్తున్న నోడల్ అధికారి

నందలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఇంతియాజ్ శుక్రవారం పర్యవేక్షించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో 12న, 20వ తేదీన మాపప్ రౌండ్‌లో ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు 12, 205 మంది చిన్నారులకు మాత్రలు వేశారు. సీహెచ్‌వో వెంకట నారాయణ, ఎంఎల్ హెచ్‌పీలు రిఫ్, హిమబిందు, సులోచన, ఏఎన్ఎం అమృత పాల్గొన్నారు

## విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కంటి చూపు ఎంతో అవసరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ తెలిపారు. శుక్రవారం సంబేపల్లె మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. సమస్య ఉన్న వారికి కొద్ది రోజుల్లో ఉచితంగా అద్దాలు అందజేస్తామన్నారు.

## జనసేన పార్టీ నాయకుల అన్నదానం



రైల్వే కోడూరు: అన్నదానం చేస్తున్న జనసైనికులు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీనటుడు చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా శుక్రవారం కోడూరు పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉ న్న ఇంద్ర బస్‌షెల్టర్ వద్ద జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. జనసేన నాయకుడు ఆలం రమేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. అభిమానుల కోసం రక్తదానం, కోవిడ్ సమ యంలో ఆయన సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

**రాజంపేట టౌన్ :** జనసేనపార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ నాగేశ్వరరాజు, డాక్టర్ అనీల్, ఏవో భూమిరెడ్డి, చిరంజీవి అభిమానులు, జనసేనపార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపు తప్పనిసరి



రైతులకు శిక్షణ ఇస్తున్న స్వామిశేఖర్

సుండుపల్లె/ఓబులవారిపల్లె, ఆగసు 22 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో కొమ్మ ల కత్తిరింపు తప్పనిసరి అని ఉద్యాన శాఖ అధికారులు వనితా బాయి, ఎం .భాస్కర్ శాస్త్రవేత్తలు ప్రసాద్‌రెడ్డి, స్వామి శేఖర్ తెలిపారు. శుక్రవారం రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో మామిడితోటల్లో కోతల అనంతరం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై వారు రైతులకు వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కాయలు కోసిన తరువాత 7 నుంచి పది రోజులు మామిడి చెట్లకు విశ్రాంతినిచ్చి కొమ్మలు కత్తిరించాల న్నారు. చీడలు ఆశించిన కొమ్మలను కత్తిరించడంతోపాటు, తోటల్లో పడి ఉన్న టెంకలను ఎండు పుల్లలు ఏరి కాల్చేయాలన్నారు. చెట్లు పూర్తిగా తడిసే విధంగా 3 గ్రాముల కాపర్ అక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కొమ్మల కత్తిరింపు తర్వాత చెట్టు వయసును బట్టి ఎరువులు సంబంధిత అధికారులను అడిగి వేయాలన్నారు. పదేళ్లు పైబడిన చెట్లకు యూరియా ఒక కేజీ, సూపర్ 5 కేజీలు, పొటాష్ 750 గ్రాముల మోతాదులో ఒక్కొక్క చెట్టు మొదలుకు 4 అడుగుల దూరంలో వేయాలన్నారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఖాదర్, బంగినపల్లి రకాల్లో ప్రతి ఏటా కాపు రావడానికి జూలై, ఆగస్టు నెలల్లో ప్రతి చిరుకొమ్మను 10 సెంటీమీటర్ల వెనక్కు కత్తిరించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ వై.లక్ష్మీప్రసన్న టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బరామరాజు, జనసేన నాయకులు రామశ్రీనివాస్, డీబీఎఫ్ వీరనాగయ్య, జలసంరక్షణ సాధన సమితి అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రా రెడ్డి

రామాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ వినోద్‌కుమార్‌ను అడిగి ఆరోగ్య కేంద్రం స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించా లని ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జూన్ నుంచి డిసెంబర్ వరకు మలేరియా, చికున్‌గున్యా లాంటి దోమల ద్వారా వచ్చే వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వారి వెంట రవీంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రేఖానాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవదానం, ఎంపీహెచ్‌ఈవో, లక్కిరెడ్డిపల్లె సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య ఆరోగ్య కార్యకర్తలు ఓబులేసు, రాజేంద్రప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజనం' అమలు తీరు పరిశీలన

రామాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, చిట్లూరు డీలర్ షాపును, కొండావాండ్లపల్లెలో పీజీఆర్ఎస్ నుంచి వచ్చిన అర్జీలను శుక్రవారం రామాపురం తహసీల్దార్ వెంకటేశులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నీలకంఠ్రావుపేట పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. చిట్లూరు లోని 29వ నంబరు చౌకదుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు. అనంతరం హసనాపురం పంచాయతీలోని కొండావాండ్లపల్లెకు చెందిన రైతు పీజీఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## వెలిగల్లు జలాశయంలో నిమజ్జనం నిషేధం

గాలివీడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వెలిగల్లు జలాశయంలో వినాయక నిమజ్జనాన్ని నిషేధించినట్లు ఎస్ఐ రామకృష్ణ, ప్రాజెక్టు ఏఈ సాంబశివుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు జలాలను రాయచోటి, గాలివీడు ప్రాంతాలకు తాగునీటి కోసం వినియోగిస్తున్నందున నిమజ్జనాన్ని నిషేధించామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలు త్వరగా నీటిలో కరగవని, అందులో ఉన్న రసాయనాలు చేపలు, ఇతర జలచరాలకు ప్రమాదకరం కావడంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## 'తలముడిపి' సమస్య పరిష్కరిస్తాం : తహసీల్దార్



చర్చలు నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

గాలివీడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తలముడిపి శివాలయం స్థల సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ భాగ్యలత, సీఐ కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్ఐ రామకృష్ణతో కలసి వారు ఇరువర్గాలతో చర్చించారు. వినాయక చవితి అనంతరం సమస్యను పరిష్కరిస్తామని, అంతవరకు ఇరువర్గాలు సంయమనం పాటించాలని సూచించారు. ఇదిలా ఉండగా తలముడిపి పాపాఘ్ని నదీ తీరాన సర్వే నెంబర్ 533/1లో 5.24 ఎకరాల భూమి ఉండగా, అందులో అత్యంత పురాతన శివలింగం, భ్రమరాంబిక ఆలయాలున్నాయి. ఆ ప్రాంతంలో తమకు డీకేటీ పట్టా ఇచ్చారని కొందరు అడ్డు తగలడంతో ఈ వివాదం తలెత్తినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు.

## మాజీ జర్నలిస్టుకు వీల్‌ఛైర్ అందజేత



జర్నలిస్టు సుభాష్ చంద్రబోస్‌కు వీల్‌ఛైర్ అందజేస్తున్న దాతలు

రాయచోటిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కారణంగా నడవలేని స్థితికి చేరుకున్న మాజీ జర్నలిస్టు సుభాష్ చంద్రబోస్‌కు శుక్ర వారం కృష్ణ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ఉషారాణి, డాక్టర్ మహేశ్వర్ రాజు ఆర్థిక సాయంతో వీల్‌ఛైర్ అందజేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం దాతలు మాట్లాడుతూ జర్నలిస్ట్ సుభాశ్‌చంద్రబోస్‌కు వీల్‌ఛైర్ అవసరం ఉందని తెలియడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నామని, వైద్యపరంగా తమవంతు సాయం చేస్తామని తెలియజేశారు. లయన్స్‌క్లబ్ రీజనల్ ఛైర్మన్ షేక్ మహమ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, జర్నలిస్టులు రాంమోహన్, బసయ్య పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మండ్ల రామాంజనేయులును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సుబ్బయ్య, సెక్రటరీగా అన్వర్‌బాషాను ఎన్నుకున్నట్లు సంఘ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్ల సమస్యలను తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే పారితోషకాన్ని సరాసరి డీలర్ల ఖాతాలో జమ అయ్యేలా చూస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ క్రాంతికుమార్, డీటీ రెడ్డెన్న, ఆర్ఐలను శాలువాలతో సన్మానించారు.

## 'సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి'

సుండుపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంపై టీడీపీ నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు వీరనాగయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి సమీపంలో సాంసేనిగడ్డ, ఎగువమాలపల్లి, బాటమాదిగపల్లి మొదలైన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలన్న సమస్యగా మారిందన్నారు. సామిసేనిగడ్డ ప్రాథమిక పాఠశాలలో వర్షం పడితే విద్యార్థులు పాఠశాలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగేశ్వర, గడ్డం నాగేశ్వర్, ఎంఎస్పీ మండల నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ ఔత్సాహిక వ్యాపారవేత్త కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ వెంకటసురేష్

పెనగలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళలు వెలుగు కార్యాలయం ద్వారా రుణమేళాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా మారాలని ఎస్‌బీఐ పెనగలూరు బ్రాంచి మేనేజర్ వెంకటసురేశ్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్, రాజంపేట ఏడీబీ నరసింహులు సూచించారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం నిరంజన్‌కుమార్ అధ్యక్షతన ఎస్ హెచ్‌జీ సభ్యులతో రుణమేళా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా బ్యాంకులతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వెలుగు సీసీలు సుధాకర్, సుబ్రమణ్యం, మండల సమాఖ్య అధ్యక్షురాలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

సిద్దవటం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పరమాత్మ సేవా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కడపాయపల్లె మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి కుటుంబీకులు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ మనవడు ధ్రుతిక్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

# తాళ్లపాక అభివృద్ధికి అడుగులు

● అన్నమయ్య జన్మస్థలిపై టీటీడీ దృష్టి ● తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయం ● క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారుల పరిశీలన





తాళ్లపాక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యానమందిరం

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు, శ్రీవారిపై 32 వేల సంకీర్తనలు రచించిన తాళ్లపాక అన్నమాచార్యుల గ్రామ అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. వైసీపీ హయాంలో కొత్తగా ఏర్పడిన జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టినా.. ఆయన జన్మస్థలి అయిన తాళ్లపాక అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాళ్లపాక అభివృద్ధిపై టీటీడీ దృష్టి సారించింది. అన్నమయ్య జన్మస్థలిని అభివృద్ధి చేయకుండా జిల్లాకు ఆయన పేరు పెట్టినంత మాత్రాన ఉపయోగం ఏమిటని ఇటీవల కూటమి నేతలు టీటీడీ పాలకమండలి దృష్టికి తీసుకుపోయారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, స్థానిక తాళ్లపాక గ్రామవాసి, పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఉద్దండం సుబ్రమణ్యం తదితరుల ఆధ్వర్యంలో తాళ్లపాక సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులపై పాలకమండలికి వినతిపత్రం ఇచ్చారు.

### 16 సమస్యలపై అధ్యయనం

ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తాళ్లపాకలో సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేసి అన్నమయ్య ఖ్యాతిని ఇనుమడింపజేయాలని నిర్ణయించారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసి అందుకు సంబంధించిన నివేదికలను టీటీడీకి సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఇటీవలే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాక గ్రామాన్ని సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. ప్రధానంగా 16 సమస్యల పరిష్కారానికి నివేదికలు తయారు చేయడానికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు.

### నివేదికల తయారీ

కడప చెన్నై జాతీయ రహదారిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద నుంచి తాళ్లపాక గ్రామం వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి. ఈ రోడ్డులో అన్నమయ్య, శ్రీవారి ప్రతిమలను ఏర్పాటు చేయాలి. ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు సెంట్రల్ లైటింగ్, తాళ్లపాక చెరువు మధ్యలో అన్నమయ్య పదవికతలను రాస్తున్నట్లు భారీ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉంది.

గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యాన మందిరాన్ని కొత్తగా ఏర్పాటు చేయాలని, అన్నమయ్య పూర్వీకులు ఉన్న ఇంటి ప్రాంతంలో ఒక కుటీరం, గ్రామంలో సంగీత కళాశాల, శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. నిత్యం అన్నమయ్య సంకీర్తనలను వినిపించాలని, అన్నమయ్య ఇలవేల్పులైన చెన్నకేశవ, సిద్దేశ్వర ఆలయాలను అభివృద్ధిపరచాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాళ్లపాకను ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటిపై టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు చేసి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేస్తే జిల్లాకు అన్నమయ్య అని పేరు పెట్టినందుకు సార్థకత ఏర్పడుతుంది.

### విజ్ఞప్తులను టీటీడీ ఆమోదించింది



ఇటీవల టీటీడీ ఛైర్మన్, ఈవోలను కలిసి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధిపై 16 సమస్యలతో కూడిన నివేదికను సమర్పించాం. వీటి ఆధారంగా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి టీటీడీ ఆమోదించింది. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాకను సందర్శించారు. వీరు నివేదికలు ఇచ్చిన వెంటనే తాళ్లపాక అభివృద్ధి శరవేగంగా జరగనుంది.

**- పోతుగుంట రమేశ్‌నాయుడు,**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట**

### తాళ్లపాకను అభివృద్ధి చేయకపోతే ఎలా



గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లాకే ఆయన పేరు పెట్టి ఆయన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయకపోతే ఎలా అని మేము ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని, అధికారులను కలిసి విన్నవించారు. దీంతో వారు తాళ్లపాక గ్రామ అభివృద్ధికోసం ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామం.

**- ఉద్దండం సుబ్రహ్మణ్యం,**
**పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, తాళ్లపాక**

## టమోటా మార్కెట్‌లో సమస్యలేంటి ?

● సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా



మదనపల్లె మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌లో రైతులు, ట్రేడర్స్ ట్రాఫిక్ సమస్యలు ఏవేమి వున్నాయంటూ సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా తీశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె యార్డు అంతటా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక క్రేట్‌కు ఎన్ని కిలోల టమోటాలు పడతాయి, వేలం పాటలు ఏవిధంగా జరుగుతున్నాయంటూ ప్రశ్నించారు. సీజన్‌లో 2 వేల టన్నుల దాకా టమోటా విక్రయానికి వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. ఇటీవల 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించినప్పుడు చేసిన సూచనల గురించి ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం యార్డు శివారులోని సివిల్ సప్లైస్ గోదామును సబ్‌కలెక్టర్ పరిశీలించి స్టాకు వివరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు కార్యదర్శి జగదీష్, అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్



ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విశ్వనాథ్

బి.కొత్తకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్యాక్రాంతమైన దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి చేస్తూ, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మండల స్పెషలాఫీసర్‌గా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. పీహెచ్‌సీగా వుంటూ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా రూపాంతరం చెందిన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు ఆరీఫుల్లా, ఫార్మసిస్ట్ సునీల్‌కుమార్‌లతో మాట్లాడి, ఆసుపత్రిలో వైద్యసదుపాయాలు, సిబ్బంది కొరత, అధునాతన పరికరాల లభ్యత, వివిధ రకాల మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషలాఫీసర్ హోదాలో ఆసుపత్రి తనిఖీ చేశాన న్నారు. జిల్లాలో శ్రీవాణి పథకం ద్వారా 230 ఆలయాలకు రూ.10లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు మంజూర య్యాయన్నారు. అదే విధంగా కొన్ని ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## మెరుగైన సేవలు అందించాలి : ఎండీ

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, విద్యుత్ ప్రసారంలో అంతరాయాలు నివారించడంతో పాటు లోటల్టేజీ సమస్యలు తీర్చాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోశ్‌రావు సూచించారు. పట్టణంలోని రాజధాని కల్యాణ మండపంలో శుక్రవారం ప్రజా సానుకూల అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె డివిజన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు దేవుళ్లతో సమానమని, వినియోగ దారులతో సత్సంబంధాలను కొనసాగించాలని తెలియజేశారు. ఈ సదస్సులో చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై సమీక్ష నిర్వహించి మండల అధికారులకు ఆ సెక్షన్‌లో పనిచేసే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర, డిప్యూటీ ఇంజనీర్స్ అసిస్టెంట్ ఇంజనీర్స్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సంతోశ్‌రావు

## ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ యూరియా కొరత రానివ్వకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా తగినన్ని నిలువలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానీయకుండా సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారు లను ఆదేశించారు. అన్ని మండలాల్లో బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టాలని కలెక్టర్ సూచించారు.

## నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి: ఎస్పీ

రాయచోటిటౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు న్యాయం జరిగేలా సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన బీఎన్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధిత స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఈ సాక్ష్య, ఈ సమన్లు అమలు చేయడం కోసం, నేర స్థలంలో ఫొటోలు, వీడియో రికార్డింగ్ చేయడం కోసం, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన అత్యాధునిక ట్యాబులను ఎస్పీ ఆయా స్టేషన్ల సిబ్బందికి అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎ.ఆదినారాయణరెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరామ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజారమేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.మధు, ఎస్ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కోర్టు కానిస్టేబుల్స్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

## 12 అంశాలతో కళా ఉత్సవ్ పోటీలు

● జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి



రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్న జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా 12 అంశాలతో కళాఉత్సవ్-2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో కళాఉత్సవ్-2025కు సంబంధించి రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రాయచోటి డైట్ కేంద్రంలో వ్యక్తిగతంగా కానీ, 9440246825 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కానీ, గూగుల్ ఫామ్ ద్వారా కానీ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు.. చంద్రామాకులపల్లెకు చెందిన రామచంద్ర (48) డయాలసిస్ చేయించుకునేందుకు శుక్రవారం ఇంటి నుంచి బైకులో వెనెకవైపు కూర్చొని మదనపనల్లె ఆస్పత్రికి బయలుదేరారు. బసినికొండ వద్ద మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడని, వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కాగా మృతుడికి పిల్లలు లేరని, భార్య ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## మున్సిపల్ ఉద్యోగులపై విచారణ

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అనుబంధ పత్రాలను అందజేయడంతో పాటు వాటి గురించి 15 రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ శుక్రవారం ఆరుగురికీ నోటీసులు జారీ చేసింది. 2022 ఆగస్టు 4న రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగురు ఉద్యోగులకు సంబంధించి పలు ఉల్లంఘనలను ఏసీబీ గుర్తించింది. మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ చంద్రగిరి లక్ష్మీనారాయణమ్మ, మున్సిపాలిటీ కార్యాలయం మేనేజరు పెర్లి శేషఫణి, సీనియర్ అసిస్టెంట్ బాలంహరినాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూల వెంకటమధుసూదన్, ఎన్నసూరు వెంకటరామకృష్ణ, లైటర్ ఇన్‌చార్జి షరాఫ్ షేక్ జమీల్ అహ్మద్‌లపై వేర్వేరు అభియోగాలు ఉన్నాయి. ఈ ఆరుగురి నుంచి సంజాయిషీలు అందిన తరువాత ప్రభుత్వం తదుపరి చర్యలకు ఉపక్రమించనుంది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఆరుగురికీ విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

## రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నాగోతు రమేశ్‌నాయుడు



నాగోతు రమేశ్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా రాజంపేటకు చెందిన నాగోతు రమేశ్‌నాయుడును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవన్ నియమించారు. రమేశ్‌నాయుడు ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొత్తగా రాష్ట్రంలో నలుగురు ప్రధాన కార్యదర్శులను నియమించిన సమయంలో అన్నమయ్య జిల్లా నుంచి ఈయనకు స్థానం కల్పించారు. ఆయన విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ నాయకుడిగా, డిగ్రీ కళాశాల ఛైర్మన్‌గా, కూచివారిపల్లె సర్పంచ్‌గా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

## అవగాహనతోనే ఎయిడ్స్‌కు దూరం

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి




విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఐఈవో రవి, తదితరులు

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రవి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి పర్యవేక్షణలో జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు మొదటి బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు, తృతీయ బహుమతి కింద రూ.2 వేల చొప్పున అందజేశారు. అనంతరం డీఐఈవో మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు కళాశాలతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు.

## హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి

● వైద్యుల శిక్షణలో డీఐవో డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులకు ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించి వారికి సుఖప్రసవం నిర్వహించడంపై మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో శిక్షణ పొందిన వారితో జిల్లాలో పనిచేస్తున్న వైద్యులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా మాతాశిశు మరణాలను తగ్గించడంలో భాగంగా వైద్యులకు ఇటువంటి శిక్షణలు ఇచ్చి వారి ద్వారా ప్రమాద సంకేతాలు గల గర్భవతుల ఆరోగ్య పరిస్థితిపై నెలావారీగా ట్రాక్ చేసి సుఖప్రసవం అయ్యే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ కిజియా, డాక్టర్ లీల తదితర వైద్యులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురు మహిళల అరెస్టు


కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీ తుమ్మలపేట వడ్డెపల్లె గ్రామంలో ఒక వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి కలికిరి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో శుక్రవారం ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వివరాల ప్రకారం.. గత బుధవారం గ్రామానికి చెందిన ఆవుల రామయ్య, సనపతి రమేష్, ఆవుల రత్నమ్మ, సనపతి అంజనమ్మ, ఆవుల సరోజమ్మలు కోళ్ల దొంగతనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ అనే వ్యక్తి కనుక్కొని వారిని పట్టుకునేందుకు యత్నించాడు. దీంతో తమ వద్ద వున్న కొడవలితో అతనిపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో చంద్రశేఖర్ గట్టిగా కేకలు వేయడంతో ద్విచక్రవాహనంలో నిందితులు పారిపోయారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎస్టీ కాలనీ సమీపంలో వున్న రత్నమ్మ, అంజనమ్మ, సరోజమ్మలను సిబ్బందితో కలిసి వెళ్లి సీఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారు. నిందితుల వద్ద కోళ్లు, కొడవలి స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ మదనమోహన్ రెడ్డి, పీసీలు మహ్మద్ అలీ, సరస్వతి, రెడ్డికుమారి, దినేష్‌కుమార్‌లు నిందితులను పట్టుకోవడంలో కృషి చేశారని, వీఆర్వో ప్రసాద్ రెడ్డి, వీఆర్‌ఏ మల్లికార్జునల సమక్షంలో పంచనామా నిర్వ హించినట్లు సీఐ వివరించారు.

## మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టి.సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామంలో ఉద్యాన సహాయకుడిగా పనిచేస్తున్న వల్లూరి ఇమ్రాన్ పని ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుటుంబ సభ్యులతో పాటు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. వృత్తి పట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఎలాంటి వ్యసనాలు లేని వ్యక్తి మృతి బాధాకరమని తెలియజేశారు. ఆర్థికపరంగా కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని విన్నవించారు. ఒత్తిడికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జాతీయ రహదారి నిర్మాణానికి
# అటవీ అడ్డంకులు

● కొనసాగుతున్న పనులు
● పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగేదెన్నడో...!


తారు రోడ్డు నిర్మాణానికి రోలరుతో చదను చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణ పనులు ఒక వైపు శరవే గంగా జరుగుతున్నా... అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర ఆలస్యం అవుతున్నాయి. టేకూరుపేట సరిహద్దులో దాదాపు ఏడున్నర కిలోమీటర్ల మేర అనుమతులు లభించాల్సి ఉంది. ఇప్పటికే చాలాసార్లు సంబంధిత అధికారులు అటవీ ప్రాంతలో సర్వే నిర్వహించి నివేదికలు కూడా పంపారు. కానీ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా అటవీశాఖ నుంచి ఇంకా పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో ఆ ప్రాంతలో రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అటవీశాఖ నుంచి క్లియరెన్స్ పూర్తయితే అంచనాల మేరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయి.

సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముదిరెడ్డిపల్లె - కడప ప్యాకేజీకి సంబంధించి 167బీ జాతీయ రహదారి నిర్మాణానికి 36 కిమీ పొడవునా పది మీటర్ల వెడల్పుతో రూ.186 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది అక్టోబరు 14న పనులు ప్రారంభించగా సజావుగా సాగుతున్నాయి. అయితే నెల్లూరు-కడప సరిహద్దు వద్ద 7.5 కిమీ, కొండుగారిపల్లె వద్ద 400 మీటర్ల మేర అటవీ శాఖ ఫారెస్టు శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంది. ల్యాండ్ ఎక్విజిషన్‌కు సంబంధించి మల్లేపల్లె వద్ద 500 మీటర్లు, కేశవాపురం వద్ద 400 మీటర్లు, రంగసముద్రం వద్ద 300 మీటర్లు క్లియరెన్సు కావాల్సి ఉంది. ఒక పక్క పనులేమో శరవేగంగా జరుగుతున్నా అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర జాప్యం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సింగరాయకొండ టు మైదుకూరు మీదుగా కడపకు ప్రయాణ సమయం తగ్గే అవకాశాలున్నాయి.

ఇప్పటివకు ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి 76 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 48 కల్వర్టులు పూర్తయ్యాయి. మరో 24 కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి. 21 కిలోమీటరు వరకు దాదాపు రోడ్డు పూర్తయింది. మరో 15 కి.మీ. పూర్తి కావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతుల కోసం సంబంధిత కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు మేనేజరు మణికంఠను వివరణ కోరగా. పనులు వేగంగా జరుగుతున్నాయని, 2026లోపే పనులు పూర్త య్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దుల్లో అటవీశాఖ నుంచి అనుమతులు వస్తే త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

## యువతిని మోసం చేసిన కేసులో
# యావజ్జీవ కారాగార శిక్ష

● రూ.1.5 లక్షల జరిమానా


శిక్ష పడిన నిందితుడిని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిమఠం పోలీసుస్టేషన్ పరిదిలో రెండున్నర సంవత్సరాల క్రితం ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. అత్యాచారం చేసి మోసం చేసిన కేసులో సానా రవికుమార్ (24) అనే వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్‌కుమార్ తీర్పునిచ్చారు. కేసు వివరాలా.. బి.మఠం మండలంలోని ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. నెల రోజుల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి పెళ్లి చేసుకోమని అడగ్గా నిరాకరించాడు. దీంతో నిందితుడు రవికుమార్ తనను మోసం చేసినట్లు బాధితురాలు 2023 జనవరి 31న బి.మఠం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి కేసు విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి పై విధంగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి


వెంకట శివుడు (ఫైల్)

మైలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాధవాపురం గ్రామానికి చెందిన బనగానివెంకటశివుడు (56) అనే వ్యక్తి గురువారం ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మిద్దెపై పని ఉండడంతో పైకి ఎక్కగా చుట్టూ కాంపౌండ్ గోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యా యి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## దొంగ అరెస్ట్..
## 52 గ్రాముల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ బంగారు నగలు, నిందితుని చూపుతున్న సీఐ, ఎస్ఐ

పుల్లంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప చెన్నై జాతీయ రహదారి సమీపంలో దొంగను అరెస్టు చేసి, 52 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. పుల్లారెడ్డిపల్లెకు చెందిన పుట్టబోయిన చరణ్‌కుమార్ అనే దొంగ వద్ద నుంచి బంగారు నెక్లెస్, డాలర్‌తో ఉన్న చైను, బుట్ట కమ్మలు, చిన్న కమ్మలు, చెవి చుట్టలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. పుల్లంపేట ఎస్ఐ శివకుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఎఫ్ఏయూకి గురుకుల భవనాలు కేటాయింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇకపై ప్రైవేట్ అద్దె భవనాల్లో కాకుండా, తాత్కాలికంగా ప్రభుత్వ భవనాల్లో పనిచేయనుంది. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యాశాఖ ఆదేశాలమేరకు, యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను తాత్కాలికంగా ఆర్కి టెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు. మొత్తం 8 బ్లాకులు, సుమారు 9360 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ ప్రభుత్వ భవనాలను దశలవారీగా అందజేయనున్నారు. మొదట 4 బ్లాకులు వెంటనే కేటాయించాలని ఆదేశించారు. మిగిలిన 4 బ్లాకులను వచ్చే నెలలోపు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఈ భవనాల్లో యోగి వేమన యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగాలు నడుస్తున్నాయి. వీటిని తాత్కాలిక సర్దుబాట్లతో వేరే చోటకు మార్చనున్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఇకపై అద్దె భవనాల బదులుగా ప్రభుత్వ భవనాల్లో సౌకర్యవంతంగా చదువుకునే అవకాశం పొందుతారు.

**మంత్రి నిర్ణయం హర్షనీయం...**

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనాల్లో పడుతున్న ఇబ్బందులను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోగులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ


ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మెగా అభిమానులు

రామసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరులో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను మెగా అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్‌లో విద్యావేత్త సదుం రవీంద్రనాథ్, అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, వృద్ధులకు బ్రెడ్, పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కె.ఎం.బాబు, సనాఉల్లా, చంద్రశేఖర్, వికాస్‌స్వామి, మంజునాథ్, డీఆర్ రాజేష్, రాము, గౌతమ్, వెంకటరమణ, క్రాంతికుమార్, కిరణ్, అభిమానులు పాల్గొన్నారు.

**మదనపల్లెలో..**

మదనపల్లె టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరం జీవి జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక వెలుగు అనాథాశ్రమంలో చిరంజీవి ప్రజాసేవా సమితి, అభిమాన సంఘం నా యకుడు రాయల్‌బుక్‌స్టార్ సుధాకర్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఆశ్రమం కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, చిరంజీవి అభిమానులు భాస్కర్, శ్రీనివాసులు, లక్ష్మీపతి, లక్ష్మణమూర్తి, రామచంద్ర పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి


విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రమేశ్

నిమ్మనపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో రమేశ్, ఎంఈవో-1 పద్మావతి అన్నారు. శుక్రవారం పెద్దమాదిగపల్లిలోని మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మదనపల్లికి చెందిన మురళి అందించిన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. గుర్తింపు కార్డులు, బ్యాడ్జీలు, అట్టలు, పలకలతో పాటు స్పోర్ట్స్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో బాలరాజు, ప్రధాపాధ్యాయుడు నాగరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉచిత ఎముకల పటుత్వ పరీక్ష శిబిరానికి స్పందన

ములకలచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంబీటీ రోడ్డులోని వెంకట పద్మావతి హాస్పటల్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఎముకల పటుత్వ పరీక్ష శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.2వేలు విలువ చేసే పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్యులు తారకరామ్, లక్ష్మీపతి వైద్యపరీక్షలు నిర్వహించారు.

## వైవీయూలో 'హెల్ప్‌లైన్' ఏర్పాటు


హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూతో పాటు జిల్లాలోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) సైట్‌లోకి వెళ్లి ప్రతి విద్యార్థి డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని.. వారి సౌకర్యార్థం ఉచితంగా సహాయ కేంద్రం పనిచేస్తుందన్నారు. వైవీయూ క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు, నాలుగేళ్ల హానర్స్ కోర్సులు బీకాం కంప్యూ టర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, అలాగే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో ప్రవేశానికి ఇక్కడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సందేహాలకు 9441032737 నెంబర్‌ను సంప్ర దించాలని కోరారు.

## సేవాభావం పెంపొందించుకోవాలి



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పీలేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత సేవా భావం పెంపొందించుకోవాలని మానవతా సేవాసంస్థ చైర్మన్ రామచంద్ర తెలిపారు. శుక్రవారం మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీలేరులోని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవాతత్పరతను పెంపొందించాలన్న లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం ఉచిత సేవలు, పేద విద్యార్థులకు చేయూత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున రెడ్డి, కరస్పాండెంట్ జనార్దన్ రెడ్డి, మానవత సభ్యులు సుబ్రహ్మణ్యం, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుద్దాం**

మదనపల్లె టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల నిర్వహణలో అందరికి ఆదర్శంగా నిలుద్దామని మానవతా సంస్థ గౌరవాధ్యక్షుడు ఆర్.గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ మానవతా సంస్థ ఉచితంగా ఫ్రీజర్‌బాక్సులు, శాంతిరథం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రమణప్ప, ఉపాధ్యక్షుడు ప్రసాదరెడ్డి, డైరెక్టర్లు రెడ్డెప్పనాయుడు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం ఐదవ శుక్రవారం సందర్భంగా ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో అష్టలక్ష్మి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు అష్టలక్ష్మి అమ్మవారికి అష్టలక్ష్మి హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన ఏర్పాటు చేశారు.


అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

## ట్రాఫిక్ సమస్యపై చర్యలు తీసుకోవాలి


డీఏవో నిర్మలమ్మకు వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్

మదనపల్లె/మదనపల్లె టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో రోజు రోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏవో నిర్మలమ్మకు వినతిపత్రం అందించారు. జిల్లా హోదా కలిగిన పట్టణంలో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోతున్నారన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పార్కింగ్‌లుగా, వ్యాపార స్థావరాలుగా వాడుకోవడంతో వాహనదారులే కాదు, పాదచారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే రోడ్లు, భవనాల శాఖ రోడ్డు ఆక్రమణ, మున్సిపల్ స్థలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో కూడా సమస్య వస్తోందన్నారు. సీటీఎంరోడ్డు విస్తరణ పేరుతో చింతమాన్లు తొలగించారని, ప్రస్తుతం అది పార్కింగ్ ప్రాంతంగా మారిందని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ సభ్యులు హరికృష్ణ, జిలాని, శశి, వినయ్, నవీన్, నాగేంద్ర, భాను తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం

పీలేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పటి పీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని అవగాహనతోనే కట్టడి చేయగలమని ఐసీటీసీ కౌన్సిలర్ రవి అన్నారు. పీలేరు సబ్-జైలులోని ఖైదీలకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేమి కారణంగా నేటికీ చాలా మంది ఎయిడ్స్ బారిన పడుతున్నారన్నారు. ఏడాదికోసారి ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఆ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే ఎయిడ్స్ బాధితుల జీవిత కాలం పెంచవచ్చునన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి రూపొందించిన ఎనిమిది రకాల అంశాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కోర్ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, సభ్యులు హసీనా, శైలజ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

**ములకలచెరువులో..**

ములకలచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్, టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీవో శివరామయ్య, ఆర్ఆర్ఎస్ ఎన్‌జీవో సభ్యులు స్వేత, సునీత, అధ్యాపకులు అల్తాఫ్‌భాను, నోములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

పీలేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం రేగళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ గురుకులంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా పీలేరు సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షా కాలంలో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాపిస్తాయని, హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, వైస్-ప్రిన్సిపాల్ రెడ్డమ్మ, సీహెచ్‌వోలు సరస్వతి, నిషిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో అగ్ని మాపక కేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్‌సిబ్బంది డెమో ప్రదర్శన ద్వారా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ నాగిరెడ్డి, ఆనంద్, మురళి, భాస్క ర్, బాబ్జి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పరమేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రూరం ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. అంతకముందే ఆలయాన్ని వేపమండలతో, పూలతో అలంకరణ చేసి అమ్మకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు, పొంగళ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



# విద్యార్థి మృతిపై అనుమానాలున్నాయి...

## దర్యాప్తు చేసి.. నిజాలు వెల్లడించాలి ● విద్యార్థి బంధువులు

వేంపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.నరసింహనాయుడు (18) అనే విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే విద్యార్థి మృతిపై మృతుడి బాబాయ్ ఉమామహేశ్వర్‌రావు, బంధువులు అనుమానాలు ఉన్నాయని... సక్రమంగా దర్యాప్తు చేసి నిజాలు వెల్లడించాలని పోలీసులకు, ట్రిపుల్‌ఐటీ అధికారులను కోరారు. శుక్రవారం శ్రీకాకుళం నుంచి ఉమామహేశ్వర్‌రావు, ఇతర బంధువులు వేంపల్లెకు చేరుకున్నారు. మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఏఓలను కలిశారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకునేంత సమస్యలు లేవు, విచారణ చేయించి నిజాలు బయటపెట్టాలని కోరారు. అలాగే పోలీసులను కలిసి దర్యాప్తు త్వరగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా డీఎస్పీ మురళీనాయక్ మృతదేహాన్ని పరిశీలించి బంధువులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులను విచారించారు. వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా వారు శ్రీకాకుళంకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.


విద్యార్థి నరసింహనాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న బాబాయ్ ఉమామహేశ్వరరావు, బంధువులు

## విగ్రహాల చెంత సీసీ కెమెరాలు తప్పనిసరి

వాల్మీకిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసుకునే వినాయకుడి ప్రతిమల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినాయకుడి ప్రతిమల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణ విషయంలో కమిటీ బాధ్యతగా నిఘా పెట్టాలన్నారు. ఐదు అడుగులు దాటి ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద తప్పనిసరిగా కెమెరాలు ఉండాల్సిందేనని, విద్యుత్ కనెక్షన్‌లు, ట్రాన్స్‌కో అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఎలాంటి డీజే, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సంఘటనలకు చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలన్నారు.

## ప్రశాంత వేడుకలకు సహకరించాలి

ములకలచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం హిందూ, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లలో విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, డీజేలు ఏర్పాటు చేయరాదన్నారు.

## రేపు జిల్లా జూనియర్ బాలబాలిక షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాల్లో ఈనెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా బాల, బాలికల జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు 2006, ఏప్రిల్ 1వ తేదీ తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. ఆధార్‌కార్డు తప్పక తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 62818 81022ను సంప్రదించాలన్నారు.

# నల్లగుట్ట వద్దకు ఎవరూ వెళ్లొద్దు

- బుద్ధుని విగ్రహ ప్రతిష్ఠ లేదు
- తహసీల్దార్, తాలూకా సీఐ వెల్లడి




మాట్లాడుతున్న తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె నల్లగుట్ట వద్దకు ఎవరూ వెళ్లొద్దని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, తాలుకా సీఐ కళా వెంకటరమణ ప్రజలకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అంకిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని నల్లగుట్టపై గౌతమ బుద్ధుని విగ్రహ పునఃప్రతిష్ఠ ఉందని, ఈ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) అధినేత పీటీఎం శివప్రసాద్ సోషల్‌మీడియాలో అబద్ధపు ప్రకటన చేస్తున్నారని, వీరు చెబుతున్న ర్యాలీ, కార్యక్రమానికి అధికారుల అనుమతి లేదన్నారు. నల్లగుట్ట ప్రభుత్వ భూమి అని, ఈ ప్రాంతం నిషేధిత ప్రాంతంగా ఉందని, అక్కడ 163 చట్టం అమలులో ఉందన్నారు. చట్టాన్ని అతిక్రమించి ఎలాంటి ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే నల్లగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రజలు గుమికూడరాదని, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. పీటీఎం శివప్రసాద్ హైకోర్టుకు వెళ్లగా, ఎలాంటి అనుమతి ఇవ్వకపోవడంతో పాటు ఆయన ఫిర్యాదును కొట్టేసినట్లు వారు వివరించారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- తహసీల్దారు శ్రీనివాసులు

తంబళ్లపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తహసీల్దారు శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం తహసీల్దారు స్థానిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, నిర్వహణ, వంట గది, పరిసరాలు, విద్యార్థుల హాజరు, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ చైర్మన్ శివకుమార్, వీఆర్వోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా కాలువలు

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- చలిమామిడిపల్లె గ్రామస్థుల ఆవేదన

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాలువలు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని చలిమామిడివారిపల్లె గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. పులికల్లు పంచాయతీలోని చలిమామిడివారిపల్లెలో మురికి కాలువలు, ప్రధాన రోడ్లు శుభ్రం చేయకపోవడంతో కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని, దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. గ్రామంలో చెత్తా చెదారాన్ని రోడ్లపైనే వేస్తున్నారని, చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తా చెదారం తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చలిమామిడివారిపల్లెలో రోడ్లపై ప్రవహిస్తున్న మురికి నీరు

## అటవీ ఉద్యోగులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులుతో పాటు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న అటవీశాఖ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం శిఖరం వద్ద అటవీశాఖ అధికారులపై దాడి చేసిన వారిని శిక్షించాలని అటవీశాఖ ఉద్యోగులు అసోసియేషన్ నాయకుడు డిమాండ్ చేశారు. ఈ దాడిని నిరసిస్తూ మదనపల్లె అటవీశాఖ ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ శ్రీశైలం అటవీశాఖ ఉద్యోగులపై అక్కడి ఎమ్మెల్యే అనుచరులు అకారణంగా దాడి చేయడం దారుణమని, దీనిపై ప్రభుత్వం విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో జయప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మదనపల్లె రేంజ్ క్షేత్ర స్థాయి, మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు, కూటమి నేతలు

పెద్దమండ్యం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలో శుక్రవారం రూ.1.8 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు అధికారులు, కూటమి నేతలు భూమిపూజ చేశారు. పెద్దమండ్యం బస్టాప్ సమీపం నుంచి మోడల్ స్కూల్ రోడ్డు వరకు సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, కూటమి నేతలు మాట్లాడుతూ పెద్దమండ్యం, సి.గొల్లపల్లి, బండమీదపల్లి, వెలిగల్లు, సిద్దవరం, మందలవారిపల్లి, దిగువపల్లి, బండకిందతాండా, పాపేపల్లి గ్రామ పంచాయతీలలో 24 సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు గాను ఈ నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత బీటెక్ సుమన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ యుగంధర్‌రెడ్డి, గంగాధర, గల్లా నారాయణ, చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ నాగార్జున, మహేంద్ర, ఫరూక్, తదతరులు పాల్గొన్నారు.

## నిత్యావసరాల గోదామ్ తనిఖీ



నిత్యావసరాల గోదామ్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద ఉన్న నిత్యావసరాల గోదామును శుక్రవారం సబ్ కలెక్టర్ కళ్యాణి తనిఖీ చేశారు. గోదాములోని నిల్వలను, అక్కడి రాకపోకలను పరిశీలించారు. గోదాములోని స్టాక్ పాయింట్‌ను, కదిపప్పు, పేదలకు పంపిణీ చేసే బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని గోదాము ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. నిత్యాసరాల సరఫరా సక్రమంగా జరగాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

## సహకార బ్యాంకు రుణాల మంజూరును సరళతరం చేయాలి

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు రుణాల మంజూరును సరళతరం చేయాలని కలికిరి సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సింగిల్ విండో ఆవరణలో జరిగిన సహకార సంఘ ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణాల మంజూరులో ఉదారంగా వ్యవహరిస్తే తిరిగి చెల్లింపుల్లో ఆ ప్రభావం వుంటుందన్నారు. వాయల్పాడు కేంద్ర సహకార బ్యాంకు మేనేజరు లావణ్య మాట్లాడుతూ గృహాలకు తనఖాపైన రైతులకు మూడు నుంచి రూ.5 లక్షల వరకూ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలకు కూడా తనఖా చేసుకుని కనీసం రూ.మూడు నుంచి 40 లక్షల వరకూ మంజూరు చేస్తామన్నారు. వ్యాపారస్తులకు 12 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకూ, రైతులకు పంట రుణాలను రూ.ఐదు లక్షల వరకూ మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కలికిరి బ్యాంకు సీఈవో కొండప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి



ప్రభుత్వాసుపత్రిలో పేషంట్లతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి

తంబళ్లపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో ముమ్మరంగా పర్యటించారు. తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం, ఎక్స్‌రే యూనిట్, బాలింతల వార్డు, దంత విభాగం, ల్యాబ్, తదితర విభాగాలను తనిఖీ చేశారు. పేషంట్లతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మోడల్ స్కూల్ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, మరుగుదొడ్ల పరిశుభ్రత, తదితరాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో థామస్‌రాజు, ఎంఈవో త్యాగరాజు, హౌసింగ్ ఏఈ సుజాత, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.